క్లుప్తంగా

గంగమ్మతల్లికి పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

తాళ్లూరు: జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో కొలువై ఉన్న గుంటి గంగా భవానీ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగ శిలలు, మల్లికార్జునస్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

అమావాస్య ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం: బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో అమావాస్య ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. త్రిపురాంతకంలోని అమ్మవారికి, చిన్నమస్తాదేవికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి గుమ్మడికాయలు, నిమ్మకాయలతో ప్రత్యేక పూజలు చేశారు. బాలాత్రిపురసుందరీదేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఈప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


రాజంపల్లిలో రాజ్యలక్ష్మి అమ్మవారు

పెద్దారవీడు: మండలం చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మీ సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, అర్చకులు భవానీప్రసాద్ ఆదివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలతో పాటు రోజూ ప్రత్యేక అలంకరణలో అలంకరించి పూజలు చేపడతామని చెప్పారు. భక్తులు నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించి, తరించాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాలు


సీపీఐ పతాకాన్ని ఎగురవేసి నినదిస్తున్న నాయకులు

త్రిపురాంతకం: సీపీఐ శత జయంతి ఉత్సవాలను చండీఘడ్‌లో నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ నాయకులు మల్లికార్జున్ తెలిపారు. మండలంలోని పార్టీ కార్యాలయం వద్ద వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. చండీఘడ్‌లో 25వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు డి శ్రీనివాస్, బి రామయ్య, ఆంజనేయులు, ఆదినారాయణ, కాశీం, నాగేశ్వరరావు, దాదా పాల్గొన్నారు.

చైతన్య సదస్సుకు యూటీఎఫ్ మహిళలు

దర్శి: ఉద్యమాలు, పోరాటాలు భవిష్యత్‌లో సంఘ బలోపేతం అనే అంశాలపై పొదిలిలో జరుగుతున్న జిల్లా స్థాయి యూటీఎఫ్ మహిళా సమావేశానికి దర్శి యూటీఎఫ్ మహిళా కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ వాహనాలను రాష్ట్ర యూటీఎఫ్ అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్లు ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు చైతన్య వంతులు కావాలని, మహిళలే ముందుండి ఉద్యమాలను నడిపించాలని చెప్పారు. ప్రభుత్వాల ఆలోచనలు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల పట్ల అణచివేత ధోరణి పని ఒత్తిడి కల్పించి బోధనకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రణభేరి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులను చైతన్యం చేస్తున్నామని స్పష్టం చేశారు. 25న గుంటూరులో జరిగే రణభేరి సభకు మహిళా కార్యకర్తలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీను, రాజశేఖర్, అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఖాసిం, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ విజయ్ కుమార్, కార్యదర్శి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


వేంపాడు వద్ద పొంగిపొర్లుతున్న వాగు


ఉధృతంగా ప్రవహిస్తున్న ఈదర వాగు


కేఎస్‌ఆర్ లాడ్జి ఎదురుగా వ్యాపార సముదాయాలను చుట్టుముట్టిన వర్షం నీరు

నీటి నిర్బంధంలో దర్శి !

- నివాసాల్లోకి వచ్చిన వర్షం నీరు
- కాలువలు పొంగి రోడ్లపైనే పారుతున్న దుస్థితి
- పలు దుకాణాలు, వ్యాపార సముదాయాల్లోకి చేరిన నీరు
- తీవ్ర అసౌకర్యానికి గురైన ప్రజలు

దర్శి:

ప్రభుత్వ నిర్లక్ష్యం దర్శి పట్టణ ప్రజలకు శాపంగా మారింది. వైఎస్సార్ సెంటర్‌లో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలకు శాపంగా మారింది. పట్టణంలోని ఎర్రచెరువు నుంచి కిందకు వచ్చే నీరు ఈ బ్రిడ్జి నుంచి పట్టణం బయటకు వెళ్తుంది. 50 ఏళ్ల క్రితం నిర్మించిన చిన్న బ్రిడ్జి కావడంతో పై నుంచి వచ్చే వర్షం నీరు బయటకు వెళ్లలేక నివాసాల వైపుకు, మురుగు కాలువల్లో నుంచి వీధుల్లోకి చేరుతోంది. దీంతో వ్యాపార సముదాయాల్లోకి, నివాసాల్లోకి వర్షం, మురుగు కలసిన నీరు చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నివాసాల్లోకి నీరు రావడంతో ఎటు వెళ్లాలో తెలియక పాములు, విషపురుగులు నివాసాల్లోకి రావడంతో క్షణ క్షణం భయం భయంగా గడుపుతున్నారు. మోటార్లు పెట్టి షాపుల్లో నీరు బయటకు కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం తమ ఇబ్బందులు పట్టించుకున్న పాపాన పోలేదని తమ వైపు కన్నెత్తి చూసే నాథుడే లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పట్టణంలో ఎటు చూసినా నీరే..

పోలేరమ్మ దేవాలయం ముందు నుంచి వర్షం నీరు ఏరులా పారుతోంది. నేటి నుంచి నవరాత్రులు నిర్వహిస్తున్న తరుణంలో ఇలా జరగడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేఎస్‌ఆర్ లాడ్జి ఎదురు రోడ్డుకు అవతల వైపు వ్యాపార సముదాయాలు నీటిలో మునిగిపోయాయి. అక్కడ నివాసాలకు నీరు చుట్టు ముట్టింది. శివశంకర్ థియేటర్ ఎదురు రోడ్డు పైనుంచే నీరు ప్రవహిస్తోంది. థియేటర్ ఎదురు దుకాణాల్లోకి నీరు చేరింది. ఆర్టీసీ బస్టాండ్ నీట మునిగి ప్రయాణికుల రాక పోకలకు అంతరాయం కలిగింది. పక్క హోటల్లోకి నీరు వెళ్లి సామగ్రి మొత్తం తడిసి పోయాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పట్టణంలో డ్రైనేజీ, సరైన రోడ్లు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


వ్యాపార సముదాయంలోకి వస్తున్న వర్షం నీరు



వర్షం నీరు రావడంతో తడిసి పోయిన సామగ్రి


వర్షం నీటిలో బిక్కుబిక్కుమంటూ కూర్చొని ఉన్న కుటుంబం


వెలమ వారి బజారులో ఇంట్లోకి వెళ్లిన వర్షం నీరు

పొంగిన వాగులు.. వంకలు

ముండ్లమూరు (దర్శి): మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు కింద వేసిన పొలాలు నీటమునిగిపోయాయి. వేంపాడు వద్ద చిలకలేరు, ఈదర వాగు, వేముల వాగులు పొర్లి పొంగుతున్నాయి. వేములలో కోరుమూరి లక్ష్మీ, తదితరులకు చెందిన సుమారు 20 ఎకరాలకు పైగా నాటిన వరి పూర్తిగా మునిగి పోయింది. పులిపాడు చెరువు క్రింద నాటిన వరి కూడా మునిగి పోయింది. వేంపాడు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.


20 ఎకరాలకు పైగా నీట మునిగిన వరి పొలం

> **ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుంది..**
> తమ వీధుల్లోకి, నివాసాల్లోకి నీరు వచ్చింది. వంట పాత్రలతో సహా మునిగి పోయాయి. రాత్రికి రాత్రే నీరు రావడంతో ఏం చేయాలో పాలు పోలేదు. నీటిలో అలాగే ఉంటున్నాం. విష పురుగులు ఇంట్లోకి వస్తున్నాయి, కనీసం వచ్చి పరామర్శించిన పాపాన పోలేదు.
> – జూపల్లి కోటేశ్వరరావు, దర్శి పట్టణం

ఆలయాలకు దసరా శోభ

- నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ముస్తాబవుతున్న ఆలయాలు


కొలువుదీరిన రేణుక ఎల్లమ్మతల్లి అమ్మవారు


శరన్నవరాత్రులకు సిద్ధమవతున్న జ్ఞానప్రసూనాంబదేవి


విద్యుత్ దీపాలతో అలంకరణలో ఆలయాలు

పుల్లలచెరువు: విజయదశమి అమ్మవారి ఆలయాలకు శోభ తెచ్చింది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లోని పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను ఎంతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు రోజుకో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. సెప్టెంబర్ 22న బాలా త్రిపురసుందరి, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణదేవిగా, 25న కాత్యాయినిదేవిగా, 26న మహాలక్ష్మీదేవిగా, 27న లలితాత్రిపురసుందరీదేవిగా, 28న మహా చండిదేవి, 29న సరస్వతిదేవి, 30న కనకదుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దినిదేవి, 2న రాజరాజేశ్వరిదేవి అలకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా రెండురోజులు అదనంగా ఉత్సవాలు జరుపుకోనున్నారు. ప్రతి ఏడాది తొమ్మిది రోజులు మాత్రమే శరన్నవరాత్రులు ఉండేది. ఈ ఏడాది రెండు రోజులు మాత్రమే ప్రత్యేకంగా వచ్చినట్లుగా అర్చకులు తెలిపారు.

కురిచేడు: సోమవారం నుంచి దేవి శరన్నవరాత్రులు ప్రారంభం అవుతున్న తరుణంలో మండలంలోని అమ్మవారి ఆలయాలు, స్థానిక జ్ఞానప్రసూనాంబసమేత కాళహస్తీశ్వరస్వామి ఆలయాలు సిద్ధమవుతున్నాయి. దర్శిరోడ్‌లోని శ్రీనివాసనగర్‌లో గల భవాని అమ్మవారి ఆలయాన్ని కాలనీలోని మహిళలు సిద్ధం చేస్తున్నారు. దేవాలయాన్ని శుభ్రం చేసి అమ్మవారి విగ్రహాలకు ఉన్న అలంకారాలను శుభ్రం చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి రోజుకు ఒక అలంకారం చేస్తూ ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పూజారి కురిచేటి సుబ్బారావు తెలిపారు.

జగనన్న ఆశయాలకు కట్టుబడి ఉంటాం


జబీవుల్లా


ఇజ్రాయిల్

యర్రగొండపాలెం: ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు కట్టుబడి పార్టీ అభివృద్ధికి పాటు పడుతామని ఆ పార్టీలో రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ కార్యదర్శి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులైన సయ్యద్ మోటార్ జబీవుల్లా, చిలకా ఇజ్రాయిల్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారు సాక్షితో మాట్లాడారు. తమకు పదవులు రావడానికి తీవ్రంగా కృషి చేసిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో ఉన్నత పదవులు ఇచ్చిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం ప్రజలలో ఉండి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న ప్రభుత్వం


ఆదినారాయణ

పెద్దారవీడు: అకడమిక్ ఇయర్ పూర్తైనా తర్వాత డిగ్రీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించడం రాష్ట్ర విద్యార్థులు చేసుకున్న దురదృష్టకరమని వైఎస్సార్ సీపీ జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు, సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. డిగ్రీ అడ్మిషన్ల కోసం నాలుగు నెలలుగా ఎదురు చూసిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నత విద్యా మండలి నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఉన్నడు లేని విధంగా ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) డిగ్రీ కళాశాల ప్రవేశాలలో ఇంత అలస్యంగా జాప్యం ఎప్పుడూ జరగలేదన్నారు. డిగ్రీ కేటాయింపులో ఈ ఏడాది పదేపదే కూటమి ప్రభుత్వం జాప్యం చేయడం వలన చాలా మంది విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. పేద విద్యార్థులు అధిక ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నా కూడా కార్పొరేట్ కాలేజీల వైపు చూసేలా చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా విధానాన్ని నిర్వీర్యం చేసిందని, కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసేందుకే ఇలాంటి నిర్ణయాలను తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కళకళలాడుతున్న మెట్టపైర్లు


పచ్చగా ఉన్న ఆముదం పైరు

దొనకొండ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది, ఆముదం, పత్తి పంటలకు సకాలంలో వర్షాలు కురవక పోవడంతో ఎండు ముఖం పట్టాయి. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవటం వలన పైర్లు కళకళలాడుతున్నాయి. గ్రామాల్లోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు అల్పపీడనం చాలా ఉపయోగ పడిందని, ప్రధానంగా వాణిజ్య పంటలైన ఆముదం, కంది, పత్తి వర్షానికి కళకళలాడుతున్నాయి. అలాగే మిరప నారు కూడా పెరగటంతో నాట్లు వేయటం కోసం రైతులు పొలాలను సిద్ధం చేసి పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో అన్ని గ్రామాల్లో నాలుగు వేల ఎకరాల్లో ఆముదం, ఐదు వేల ఎకరాల్లో కంది, ఎనిమిది వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు సమాచారం.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు


మద్యం బాటిళ్లు చూపుతున్న సిబ్బంది

కురిచేడు: మండలంలోని గంగదొనకొండ గ్రామంలో అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలను నిరోధించడంలో భాగంగా దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కురిచేడు మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాపుల మీద జరిపారు. గంగదొనకొండ గ్రామ సమీపంలో రామయ్య అను వ్యక్తి వద్ద నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈదాడుల్లో దర్శి ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ షేక్ యూసఫ్, షరీఫ్, దర్శి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది షేక్.ఖాసిం పీరా, సాయిబాబా, కే.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


సైకిళ్లపై ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్న సీఐ, ఎస్సై

యర్రగొండపాలెం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సీహెచ్ ప్రభాకరరావు పేర్కొన్నారు. ఎస్పీ వీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు నడుం కట్టారు. ఆదివారం ఉదయం నుంచే ఆ పనిలో పోలీసులు శ్రమించారు. సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య ఆధ్వర్యంలో పోలీసులు సైకిళ్లపై ప్రధాన వీధులలో పర్యటించారు. రోడ్లపై బండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేసేవారిని వెనక్కి వెళ్లమని ముందుగా హెచ్చరించారు. శాశ్వతంగా చెక్కబల్లాలు, దుకాణాలు ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేవారిని తీవ్రంగా హెచ్చరించారు. స్వయంగా పోలీసులే స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దుకాణాలను తొలగించారు. వాటిని పంచాయతీ సిబ్బందితో ఇతర ప్రాంతాలకు తరలింప చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఫుట్‌పాత్‌లపై వ్యాపారం సజావుగా చేసుకోవచ్చని, ఎటువంటి సందర్భంలోనైనా రోడ్డు మార్జిన్ దాటి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. మార్కాపురం–మాచర్ల ప్రధాన రోడ్డుతోపాటు స్థానిక కొలుకుల రోడ్డు, త్రిపురాంతకం రోడ్డు, అమ్మవారిశాల రోడ్డు, ఎస్‌బీఐ రోడ్డులపై నిరంతర నిఘా ఉంటుందని ఆయన తెలిపారు.

దేవరాజుగట్టులో వైద్య శిబిరం


మురుగు నీటిని పరిశీలిస్తున్న డాక్టర్ జగదీష్

పెద్దారవీడు: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దేవరాజుగట్టు గ్రామ సచివాలయంలో వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ జగదీష్ ప్రజలకు మలేరియా, డెంగీ పరీక్షలు చేసిన అనంతరం మందులను పంపిణీ చేశారు. ఆదివారం సాక్షి పత్రికలో మంచం పట్టిన దేవరాజుగట్టు శీర్షిక ప్రచురించారు. అందుకు స్పందనగా ఎస్సీ కాలనీలో మురుగు నీటి ప్రదేశాలను ఆరోగ్య సిబ్బంది సందర్శించారు. గ్రామంలో ప్రతి ఇంటిని ఫీవర్ సర్వే నిర్వహించి తనిఖీలు చేశారు. గ్రామంలో కాలువలు లేకపోవడంతో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షం నీరు రోడ్లపైనే నిల్వ ఉండటాన్ని గమనించారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లానాని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ ఇజ్రాయిల్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లలచెరువులో 64 మి. మీ వర్షపాతం నమోదు


వర్షపునీటితో కళకళలాడుతున్న కాటివీరన్న చెరువు

పుల్లలచెరువు: శనివారం అర్ధరాత్రి పుల్లలచెరువు మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం పడింది. దీంతో చెరువులు, కుంటల్లో పూర్తి స్థాయిలో నీరు చేరింది. పుల్లలచెరువులో 64 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. పుల్లలచెరువులోని కాటివీరన్న చెరువు, రామన్న చెరువులో బాగా వర్షపు నీరు చేరింది. పంటలకు ఈ వర్షం ఎంతో వెసులుబాటు కల్పిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిర్చి పంటలో నల్లి అప్పుడే సోకడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షాలకు అది ఇంకా ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.